www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 16 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

## నిస్వార్థంగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందించాలి



-గ్రామ పరిపాలన అధికారులకు పోస్టింగ్ ఆర్డర్లు అందించిన కలెక్టర్

2 లో

# చెరగని ఉద్యమ వారసత్వం






**-సాయుధ పోరాటానికి దన్నుగా నిలిచిన పల్లెలు**
**-గ్రామానికో చరిత్ర**
**-స్ఫూర్తినిచ్చిన యోధుల అమరత్వం**

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సువర్ణక్షారలిఖితం ఇటువంటి మహత్తర తెలంగాణ పోరాటంలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేకత ఉన్నది ఆనాడు ఉద్యమంలో ముందు వరుసలో నిలవటమే కాకుండా నేటికి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తున్నది. ఖమ్మంజిల్లాలోని అనేక పల్లెలు ఉద్యమానికి బాసటగా నిలిచాయి. గ్రామాలకు గ్రామాలే తిరుగుబాటుకు శ్రీకారం చుట్టాయి. ఆనాటి నిరంకుశత్వాన్ని, పెత్తందారి తనాన్ని, వెట్టిచాకిరిని నిరసిస్తూ ఉవ్వెత్తున లేచిన మహోద్యమంలో అప్పటి ఖమ్మం మెట్టు అగ్రభాగాన నిలిచింది. ఏజెన్సీ, మైదానం అనే తేడా లేకుండా నిజాం, రజాకారుల, ముష్కరుల ఆగడాలను ఎదుర్కొన్నది. అప్పట్లో చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉద్యమాలను నడిపించారు. కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ మిగతా 2లో..

## నిజాం నవాబు, రజాకార్లను తరిమి కొట్టిన ఘనత కమ్యూనిస్టులది



**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం,రజాకార్లను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్ట్ పార్టీది అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సోమవారం నేలకొండపల్లి సిపిఐ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని అమరజీవి కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజాం నవాబు, రజాకార్ల ను, జమీందార్లు లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీది అన్నారు. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి,మగ్దూం మోహినోదన్ పిలుపు తో ప్రజాలంతా నిజాం కు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర నేటి తరం విద్యార్థులకు తెలియజేసే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఆనాడు కర్నాటి మిగతా 2లో..

## ప్రతీ పల్లెను ప్రగతి వైపు పరుగులు పెట్టిద్దాం






**- గ్రామగ్రామానికి పక్కా రహదారుల నిర్మాణం**
**- రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి**
**- ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నా**
**- ఎంఎల్ఏ కూనంనేని**
**- రూ.4.29 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజలకు కావాల్సిన విద్యా,వైద్యం, రహదారులు,విద్యుత్ వంటి మౌళిక సదుపాయాలు కల్పించి ప్రగతివైపు ప్రతీ పల్లెను పరుగులు పెట్టిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం హేమచంద్రాపురం, కోరుకొండ, లోతువాగు, ప్రశాంతినగర్, శేషగిరి నగర్, తెలగ రామవరం పంచాయితీల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.4.29కోట్ల ఎస్ సిపి, ఎన్ఆర్ఈడిఎస్ పథకాల్లో మంజూరైన నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ పల్లె రహదారులు, గ్రామాల అనుసంధాన రహదారులు, ప్రధాన రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించించామని, మిగతా 2లో..

# చెరగని ఉద్యమ వారసత్వం

మొదటిపేజీ తరువాయి)

, దేవూరి శేషగిరిరావు, సర్వదేవభట్ల రామనాథం ఉద్యమ అగ్రభాగాన సాయుధులై పోరాడారు. చిర్రావూరి లక్ష్మి నారాయణ, కెఎల్ నర్సింహా రావు, పర్సా సత్యనారాయణ లాంటి వారు కూడా ఉద్యమంలో ముందు నడిచారు. విద్యార్థిగా ఉండి కమ్యూనిస్టు పార్టీ శిక్షణా తరగతులకు హాజరైన నల్లమల గిరిప్రసాద్ ఆతర్వాత సాయుధ దళ నేతగా ఎదిగారు. తుపాకీ గుండ్లకు సైతం ఎదురొడ్డి నిలిచిన నల్లమల గిరిప్రసాద్ అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకునిగా ఎదుగడమే కాకుండా ఎంఎల్ఎగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దేవూరి శేషగిరి రావు ఉద్యమ సమయంలోనే ప్రాణాలను కోల్పోయారు. దేవూరి శేషగిరి రావు పేరులోని గిరిని తన ముందు ఉంచుకుని నల్లమల ప్రసాద్ నల్లమల గిరిప్రసాద్‌గా చిరపరిచితులయ్యారు. సర్వదేవభట్ల రామనాథం జమీందారి కుటుంబంలో జన్మించి ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన మహోన్నతుడు. వాసిరెడ్డి వెంకటపతి, రావెళ్ల జానకిరామయ్య, కర్నాటి కృష్ణయ్య, వట్టికొండ రాంకోటయ్య, చుండూరు నర్సింహారావు, మల్లెల వెంకటేశ్వర్లు, తమ్మారపు గోవింద్, మచ్చా వీరయ్య, రావెళ్ల సత్యం, బోడేపూడి రాంకోటేశ్వరరావు, గడల సీతారామయ్య, కొమరయ్య, రాములు, రాజేశ్వరరావు తదితరులు ఉద్యమ అగ్రభాగాన నిలిచి దళ కమాండర్లుగా పని చేశారు. మహ్మద్ రజబ్‌అలీ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తన ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలి సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. సిపిఐ పక్షాన ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ముఖ్యంగా బండి పట్టాల ఉద్యమం జక్కేపల్లి రైతు సదస్సు విజయవంతానికి రజబ్‌అలీ చేసిన కృషి చిరస్మరణీయం. కర్నాటి కృష్ణయ్య సాయుధ పోరాట అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, రైతు సంఘం నాయకునిగా, ఖమ్మం శాసన సభ్యునిగా పని చేశారు. అనేక మంది తెలంగాణ సాయుధ పోరాటంలో పాలుపంచుకున్నారు. సామాన్యులు ఆయుధాలు పట్టి పోరాడిన ఈ పోరాటం అనేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. అనేక గ్రామాలు కమ్యూనిస్టు కేంద్రాలుగా వర్థిల్లాయి. సాయుధ పోరాట అనంతరం కూడా ఖమ్మం జిల్లాలో అనేక గ్రామాలు ఉద్యమ వాసనలు ఇప్పటికీ వెదజల్లుతున్నాయి. అనేక మంది యోధుల వారసులు ఖమ్మం జిల్లా ఉద్యమంలో కీలక భూమిక పోషిస్తున్నారు. మారిన రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సైతం బూర్జువా రాజకీయాలను పక్కన పెట్టి కమ్యూనిస్టులకు అండగా నిలుస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. స్వాతంత్ర్య అనంతరం ఇంత వరకు కమ్యూనిస్టులు ఓటమి చెందని గ్రామాలు ఉన్నాయంటే ఉద్యమ వారసత్వం ఎంత బలంగా ఉందో అవగతమవుతుంది. దాడులకు ఎదురొడ్డి సర్వస్వం కోల్పోయిన కుటుంబాల వారసులు సైతం ఎర్రజెండా నీడన పని చేస్తూ తాము నిజమైన ఉద్యమ వారసులమని రుజువు చేసుకుంటున్నారు. సాయుధ పోరాట వార్షికోత్సవ వేళ గ్రామ గ్రామాన నాటి జ్ఞాపకాలను కుటుంబాలు నెమరువేసుకుంటున్నాయి. ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామానికి ప్రతి చెట్టుకు పుట్టకు ఒక చరిత్ర ఉందంటే అతిశయోక్తి కాదు. ఆ ఉద్యమ వారసత్వాన్ని మరింత బలోపేతం చేసి బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాల్సి ఉంది. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటంతో పాటు ప్రజల్లో రాజకీయ సైద్ధాంతిక అవగాహనలు పెంపొందించుకుని ముందు సాగాల్సి ఉంది. తెలంగాణ పోరాటంలో అతి క్రూర ఘటనలు చోటు చేసుకున్న సమయంలో సైతం మనో ధైర్యంతో ప్రజలు విప్లవోద్యమంలో ముందుకు అడుగేశారు. బోనకల్ మండలం గోవిందాపురంలో ఒకే చితిపై ఏడుగురిని వేసి కాల్చి చంపినప్పుడు, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొందరిని శరీరంలోని ఒక్కో భాగాన్ని ఒక్కో రోజు తొలంచిన ఉద్యమం నుంచి వెనకడుగు వేయలేదంటే ఆనాటి ప్రజల ధైర్య సాహసాలు అవగతమవుతాయి. ఆ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగడమే సాయుధ పోరాట వారోత్సవ వేళ అమరులకు మనమిచ్చే సరైన నివాళి.

## బొగ్గు విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**- సిఎం పిఎఫ్ కార్యాలయం ముందు నిరసన**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి విశ్రాంత ఉద్యోగులు సిఎంపిఎఫ్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెన్షన్ పెంపు, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ కలకత్తా లోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం ముందు ఆల్‌ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన బొగ్గు గని కార్మికులు భారీ ప్రదర్శన, నిరసన తెలిపారు. ఇందులో భాగంగా ఆ నిరసనకు సంఘీభావం ప్రకటిస్తూ స్థానిక విశ్రాంత ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు మాతంగి లింగయ్య, ప్రధాన కార్యదర్శి అన్యం లక్ష్మీనారాయణ, డి శేషయ్య, వంగా వెంకట్,ఎస్‌వి రమణ మూర్తి తదితరులు మాట్లాడుతూ గత 27 సం. క్రితం ప్రవేశపెట్టిన కోల్‌మైన్ పెన్షన్ స్కీం 1998 ప్రకారం కనీస పెన్షన్ రూ.350 నిర్ణయించారని, ఎన్నో ఆందోళనల ఫలితంగా దానిని రూ.1000 చేశారని, కానీ ఇది విశ్రాంత ఉద్యోగల ఆకలి తీర్చదని అన్నారు. కోల్‌మైనస్ పెన్షన్ స్కీం చట్టం ప్రకారం ప్రతి మూడు సం.లకు ఒక సారి సవరించాలనే నిబంధనను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పబ్లిక్‌అకౌంట్స్ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వినియోగ దారుల ధరల సూచికను అనుసరించి కరువు భత్యాన్ని అనుసంధానం చేస్తూ పెన్షన్ పెంచాలని, ప్రతీ ఐదు సం.లకు ఒకసారి జరిగే వేతన ఒప్పందంతో పాటు పెన్షన్ పెంచాలని, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రద్దు చేసి కేంద్రబొగ్గు మంత్రిత్వశాఖ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ , కోల్ ఇండియా, సింగరేణి ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని, కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ ,డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, బొగ్గు యాజమాన్యసంస్థల వార్షిక లాభాల నుంచి మూడు శాతం పెన్షన్ ఫండ్ కు కేటాయించాలన్నారు. ఉద్యోగులు, అధికారులకు ఒకే విధమైన వైద్య విధానం కొనసాగించాలని, హైదరాబాద్‌లో త్వరగా సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నెలకొల్పి అందులో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా అపరిమితమైన వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. క్రిష్టోఫర్, కే నాగేశ్వరరావు, రాజమౌళి, మాటేటి గోపాల్ , కోటేశ్వరరావు, గోపికృష్ణ, మండల రాజు, డి నాగేశ్వరరావు, వీరస్వామి, సురేష్, శంకర్, ఎన్‌ఆర్కే రెడ్డి, బండారి రాజయ్య, కే బీరయ్య, లక్ష్మీనారాయణ, గీస కనకయ్య, పూర్ణ ప్రకాష్, కోటి,మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్‌సింగ్, రామరాజు,రఫీక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## నిస్వార్థంగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నూతనంగా నిర్మించిన గ్రామ పరిపాలన అధికారులకు సోమవారం పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులను నియమించిందని తెలిపారు. జిల్లాలో 299 క్లస్టర్లకు గానూ 252 మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి సొంత మండలం మినహాయించి ఇతర ప్రదేశాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పరిపాలన అధికారులుగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ పాలన అధికారులు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం భూ భారతిని పటిష్టంగా అమలు చేసేందుకు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజల భూ సమస్యల పరిష్కారం పట్ల నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. రెవెన్యూ శాఖ ప్రభుత్వంలో చాలా కీలకమని ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రైవేటు, పట్టా భూముల నిర్వహణ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ వంటి అనేక కీలక బాధ్యతలు మన వద్ద ఉంటాయని నిబంధనల ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందించాలని ఎక్కడ అవకతవకలకు పాల్పడడానికి వీలు లేదన్నారు. సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని క్షేత్ర స్థాయిలో గ్రామ పరిపాలన అధికారులను నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. నేడు నియామక పత్రాలు పొందుతున్న అభ్యర్థులు వెంటనే విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, నూతన గ్రామ పరిపాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాం నవాబు, రజాకార్లను తరిమి కొట్టిన ఘనత కమ్యూనిస్టులది

మొదటిపేజీ తరువాయి)

కృష్ణయ్యను పట్టిస్తే 10000 రూపాయల ను బహుమతి గా ఇస్తామని నిజాం ప్రభుత్వం ప్రకటించింది అని గుర్తు చేశారు. రజాకార్ల కు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాయుధ పోరాటం లో తన వంతు పాత్రను పోషించిన గొప్ప నాయకుడు కర్నాటి అని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం లో క్రియాశీలక పాత్ర ను పోషించిన ఘనత కర్నాటి కృష్ణయ్య ది అని తెలిపారు. అయన ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసా ద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు,వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్ రావు,మండల కౌన్సిల్ సభ్యులు చావ గణపతి రావు, ఆలేటి మహేష్, తమ్మిశెట్టి మమత, కుంచం బిక్షం, బాలిన కృష్ణంరాజు, కాశబోయిన అయోధ్య, అబ్దుల్ సత్తార్, రావెల కృష్ణయ్య, వల్లాల కృష్ణ, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, అనంత పుల్లయ్య, బాలెబోయిన వెంకటేశ్వర్లు, చిలువేరు రేణుబాబు, కనకబండి కృష్ణయ్య, చెన్నబోయిన మల్లయ్య, మాధవరావు పాల్గొన్నారు.

## ప్రతీ పల్లెను ప్రగతి వైపు పరుగులు పెట్టిద్దాం

మొదటిపేజీ తరువాయి)

దశల వారీగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రహదారుల సౌకర్యం మెరుగుపడిన నాడే గ్రామాలు అనుకున్న మేరకు అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. ప్రతీ గ్రామం పంచాయితీ కేంద్రాల్లో హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయితీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ సేవా కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా సంక్షేమం, నియోజకవర్గాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తునట్లు తెలిపారు. అభివృద్ధి నిధులు రాబట్టేందుకు ఏ అవకాశం ఉన్న పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందన్నారు. శంకుస్థాపనలు జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో పతికాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అందుకు అధికారులు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీ పతి, నునావత్ గోవింద్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, వీరబాబు, హన్మంతరావు, పీఏసిఎస్ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, కాంగ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, అధికారులు అంకుబాబు, శిరీష, శ్రీనివాసరావు, రామకృష్ణ, రఘురామయ్య, వెంకటస్వామి, అమ్మసాంబయ్య, శివలాల్ పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆకలి తీరుస్తున్న పాధ్యాయులు

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గత నాలుగు రోజుల నుండి వంట సిబ్బంది సమ్మె బాట పట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు వంట చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు. సోమవారం ఉదయం నుండి ఉపాధ్యాయులు వంటలు చేయడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది మొత్తం సమ్మెల్లో పాల్గొనడంతో ఉన్నతాధికారులు చేసేది ఏమీ లేక ప్రభుత్వానికి చెప్పలేక మధ్యలో నలిగిపోతున్నారు. వంట సిబ్బందికి ఏప్రిల్ నెల నుండి ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వకపోవడంతో సమ్మెబాట పట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## అంగన్వాడీలకు వేతన పెంపు హామీ అమలు చేయాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీలకు ప్రజా ప్రభుత్వంలో 18వేల రూపాయల వేతనాన్ని ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని ఈ హామీని తక్షణమే అమలు పరచాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సీతామాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో జరిగిన అంగన్వాడీ టీచర్స్ సమావేశంలో మాట్లాడుతూ పీఎం స్కూల్స్ అని మోడీ ప్రభుత్వం, ఫ్రీ ప్రైమరీ స్కూల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొత్త పథకాలు పెట్టి అంగన్వాడీ కేంద్రాలను మూత వేసి ప్రైవేట్ వారికీ ఐసిడిఎస్ సంస్థను ఒదిలించుకోవాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంకు వచ్చే చిన్నారులను సీఎం ఫ్రి ప్రైమరీ పాఠశాలకు తరలిస్తే అంగన్వాడీ కేంద్రాలు ఎలా నడుస్తాయన్నారు. ఇటీవల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కలిసి అంగన్వాడీ కేంద్రాలను సాంకేతిక విద్య వైపు తీసుకెళ్లటం శుభపరిణామని కానీ ఆయా కేంద్రాలు పని చేస్తున్న అంగన్వాడి టీచర్లకు అందుకు కావాల్సినటువంటి సాంకేతిక పరిజ్ఞానం మౌలిక వసతులు ఆధునిక సెల్ ఫోన్లు ఇవ్వకుండా ఎలా పని చేస్తారని ఆమె ప్రశ్నించారు. నూతన వరవడితో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం ఉద్యోగులు గుర్తించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు.

## ఆదివాసి గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలోని తొడితలగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన పేదింటి బిడ్డ ఎట్టి ప్రియకు అరుదైన గౌరవం దక్కింది. బీఈడీలో యూనివర్సిటీ స్థాయి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రియకు గోల్డ్ మెడల్ అవార్డును ప్రకటించింది. మారుమూల గిరిజన గ్రామం ఆదివాసి కుటుంబంలో జన్మించిన ప్రియ తండ్రి ఎట్టి రమణ చిన్న తనలోనే మృతి చెందాడు. అప్పటి నుండి తల్లి ఎట్టి కోటేశ్వరి కూలి పని చేసుకుంటూ ప్రియను చదివించింది. ప్రియ ఒకటి నుండి 8వ తరగతి వరకు ఇల్లందు సింగరేణి కాలరీస్ పాఠశాలలో , 9,10వ తరగతులు గుండాల మండలం కాంచనపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో, ఇంటర్ ఇల్లెందులోని గిరిజన గురుకుల కళాశాలలో, డిగ్రీ ఖమ్మం జిల్లా తనికెళ్లలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో, బీఈడీ నల్గొండలోని డీవీఎం కళాశాలలో(కౌన్సిలింగ్ ద్వారా ప్రభుత్వ కోటాలో), పోస్ట్ గ్రాడ్యుయేట్ కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో అభ్యసించింది. పేద గిరిజన ఆదివాసి బిడ్డ మహాత్మాగాంధీ యూనివర్సిటిలో బంగారు పతకం సాధించడం పట్ల గ్రామస్తులు, మండల ప్రజలు ప్రియను అభినందించారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**-ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలని మన పరిధిలో ఉన్న పనిని వెంటనే పూర్తి చేయాలన్నారు. చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనల వివరాలను తెలుపుతూ లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు. వార్తా పత్రికలలో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలపై క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల వివరాలను అందించాలని దీనిపై డిఆర్వో సమీక్ష చేయాలన్నారు. ఈఈ హౌజింగ్, డిఆర్డివో, డిపివో, డిఎంఅండ్హెచ్వో, వివిధ శాఖల వద్ద పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై తీసుకున్న చర్యలకు సంబంధించి రిపోర్టు పెండింగ్ ఉందని వీటిని సకాలంలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. గన్నవరం క్రాస్ రోడ్డులోని రెబ్బవరం బస్టాండ్‌ను ఆక్రమించారని ఇట్టి ఆక్రమణను తొలగించి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని పలు గ్రామాల ప్రజలు దరఖాస్తు చేశారు. వైరా మండలానికి చెందిన ఎస్. విద్యాసాగర్ సెమీ అర్బన్ స్టూడెంట్‌కు ఎస్సి గురుకులంలో ఏడవ తరగతి సీటు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. వేంసూరు మండలం కందురు రెవెన్యూ గ్రామ రైతులు తాము వరుణ్ అగ్రిటెక్ వారి బిపిటి 2787 వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశామని ఎకరానికి రూ. 25వేలు ఖర్చు అయిందని కల్తీ విత్తనాలతో నష్టపోయామని సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. బోనకల్ మండలం ఆళ్లపాడుకు చెందిన మరీదు శ్రీను తనకు వచ్చే దివ్యాంగుల ఫించన్ మూడేళ్లుగా ఆగిపోయిందని తనకు ఫించన్ ఇప్పించాలని దరఖాస్తు చేశారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్, కంటింజెంట్, పార్ట్ టైం వర్కర్స్ యూనియన్ జేఏసి తరుపు తమకు పాత పద్ధతిలో కలెక్టర్ గెజిట్ ప్రకారం తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని దరఖాస్తు చేశారు.ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన చర్యలను తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

**-పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓపెన్ స్కూల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు జరిగే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటితో పాటు కనీస మౌలిక సదుపాయాల కల్పన చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ నందు 287 మంది అభ్యర్థులకు ఓపెన్ ఎస్ఎస్‌సి పరీక్షలు, రిక్కాబజార్‌లోని జిహెచ్ఎస్ నందు 254 మంది అభ్యర్థులకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ సెక్షన్ పెట్టాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. ప్రశ్నా పత్రాల తరలింపుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. ఏఎన్ఎంలతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడిచేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, డిఎంఅండ్‌హెచ్వో డాక్టర్ బి. కళావతి బాయి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవి బాబు, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి మంగపతి రావు, పోలీస్, మున్సిపల్, పోస్టల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

**-ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహిళల సంక్షేమం తో పాటు వారి ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. మహిళలను రాజకీయంగా చైతన్యవంతం చేసేందుకు 1952లో కాంగ్రెస్ పార్టీకి మహిళా సెల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 1983లో ముంబాయి ఏఐసిసి సమావేశంలో దీనికి పూర్తి స్థాయి స్వాతంత్ర సంస్థగా హోదా ఇవ్వాలని తీర్మానించిందన్నారు. అది నేడు మహిళా కాంగ్రెస్ సంఘంగా ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు రాష్ట్రంలో ఏ పథకం అమలు చేయాలన్నా మహిళల పేరుతోనే అమలు చేస్తూ మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, కార్పొరేటర్ లకావత్ సైదులు, నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, దివ్య, స్వరూప, రజని, చంద్రిక, లక్ష్మి, నీలవేణి, భవాని, నసీమా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పెసర పంటకు నష్టపరిహారం ఇవ్వాలి



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పెసర పంటకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్షులు కొంగర భాస్కర రావుతో కలిసి పలు సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 400 ఎకరాల పెసర సాగు అధిక వర్షాలకు నష్టం వాటిల్లిందని, సాగు భూముల్లో రోజుల తరబడి నీరు నిలిచి పంట కుళ్లిపోయిందని అన్నారు. నష్టం అంచనాను తక్షణమే వ్యవసాయ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేయాలని సూచించారు. రైతు ఆరుకాలం శ్రమించి అధిక వర్షాలకు నిలదొక్కుకొని పండిన పెసరను అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.8500 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారులు కేవలం 3 వేలు నుంచి రూ.3500 మాత్రమే చెల్లించి రైతులను దొచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నష్టపరిహారం విషయంలో రైతుల పట్ల వ్యవసాయ అధికారుల వ్యవహరించిన తీరు దుర్మార్గమని, మరల అటువంటి పునరావృతం కాకుండా చూడాలని ప్రజావాణి అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఎం మండల కార్యదర్శి కిలారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయికి ఎంపికైన త్రివేణి విద్యార్థి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నేషనల్ సైన్స్ సెమినార్ 2025 రాష్ట్ర స్థాయి పోటీలకు త్రివేణి పాఠశాల విద్యార్థి కె. వనీషారెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నేషనల్ సైన్స్ సెమినార్ 2025 జిల్లా స్థాయి పోటీల్లో కె. వనీషారెడ్డి మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఖమ్మం నగరంలో సైన్స్ మ్యూజియంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ లో ప్రథమ స్థానం పొందిన వనీషారెడ్డిని ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం అర్బన్ ఎంఈవో శైలజ లక్ష్మి, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రామారావు, జీవశాస్త్ర జిల్లా రిసోర్స్ పర్సన్ మాధవరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా త్రివేణి విద్యా సంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో, సైన్స్ సెమినార్‌లో ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వై. వెంకటేశ్వరరావు, సిఆర్వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంతో పాటు బల్లేపల్లి నార్త్ జోన్ కార్యాలయం, సౌత్ జోన్ పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంతో పాటు సౌత్, నార్త్ జోన్ కార్యాలయాల్లో ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల ధర్నా



**ప్రజాపక్షం/ మధిర :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భట్టి క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్వాడి వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు మాట్లాడుతూ ఫ్రీ ప్రైమరీ పిఎం శ్రీవిద్యను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, విద్యాబోధనా బాధ్యత అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని, అదనపు వేతనం చెల్లించాలని, ఎఫ్ఆర్‌సి రద్దు చేయాలని, ఒకే ఆన్‌లైన్ యాప్ ఉండే విధంగా వెంటనే నిర్ణయం చేయాలని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18వేలు కనీస వేతనం ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని తదితర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్ల ధర్నా సందర్భంగా క్యాంపు కార్యాలయం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పొంగులేటి శ్రీనన్న అభిమాని లక్ష్మారెడ్డి మృతి

**- నివాళులర్పించిన తుంబూరు దయాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభిమాని మధిర మండలం మర్లపాడు గ్రామానికి చెందిన వేమిరెడ్డి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి లక్ష్మారెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మారెడ్డికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అంటే ఎనలేని అభిమానమని, లక్ష్మారెడ్డి అకాల మృతితో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులుర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ప్యాక్స్ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, టిపిసి సభ్యులుఅమరవాది సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, కపిలవాయి సత్యనారాయణరాజు, నాగిరెడ్డి ఉన్నారు.

# బిఎల్‌వోలతో తహశీల్దార్ సమావేశం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల తహశీల్దార్ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్, బూత్ లెవల్ ఏజంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిఎల్‌ఓ లకు తహశీల్దార్ పలు సూచనలు చేశారు. ఓటు నమోదులో పారదర్శకంగా వ్యవహారించాలని సూచించారు. వయసులో మార్పులు కాకుండా ఇంటి పేరు పేరులో అక్షర దోషాలను సరిచేయాలని బూత్ వారీగా ఓటు బిఎల్‌ఓ, బిఎల్‌ఏ ల విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్షన్ అధికారి డిటి సయ్యద్ ఇమ్రాన్, పెనుబల్లి డిటి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ప్రజాపక్షం/ మధిర : డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సమక్షంలో మాటూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాటూరు ఎస్సీకాలనీకి చెందిన ఎకిటాల కృష్ణారావు, పుట్టా పుల్లారావు ఆధ్వర్యంలో పుట్టా కిరణ్, పుట్టా వెంకట్రామ, కంచిపోగు నాగేశ్వరరావు, కంచిపోగు మంగమ్మ, గొల్ల మందల ముత్తయ్య, గొల్లమందల వెలిశమ్మ, రాయబరపు మోహన్, చిట్టెమ్మ, వేల్పుల మరియమ్మ, పుట్టా ఈరలమ్మ, పుట్టా మరియమ్మ, పందుల దానమ్మ, పుట్టా ఏసమ్మ తదితరులు పార్టీలో చేరగా వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు పెంచాలని వినతి



ప్రజాపక్షం/ మధిర : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వృద్ధులు, వికలాంగులకు ఫెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఫెన్షన్లు పెంచే వరకు తాడో పేడో తెల్చుకుంటామన్నారు. వికలాంగులకు, వింతతువులకు రూ.2వేలు నుండి రూ.4వేలు, రూ.4వేలు నుండి రూ.6వేలు వరకు ఫెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాన్ని నిలుబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్శపు ఏసుక మాదిగ, కనకపూడి శ్రీనివాస్ మాదిగ, రాయవరపు దాసు కూరపాటి సురేష్, వేల్పుల పవన్‌కళ్యాణ్, దోర్నాల ఆంజనేయులు, మెసుపోగు ఇర్మియా, స్వామి, ఎస్కె రంజాన్ తదితరులు పాల్గొనగా బిజెపి నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, బాపట్ల రమేష్, శివరాజు సుమంత్, స్వర్ణాకర్ తదితరుల సంఘీభావం తెలిపారు.

## పనులు నిలుపుదల చేయాలి



ప్రజాపక్షం/ మధిర రూరల్ : అండర్ పాస్ నిర్మాణం ఎత్తు పెంచే వరకు నాగపూర్ అమరావతి హైవే పనులు నిలుపుదల చేయాలని నిధానపురం గ్రామ ప్రజలు సోమవారం పనులు జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. నాగపూర్ నుండి అమరావతి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా మండల పరిధిలోని నిధానపురం గ్రామ సమీపంలో అండర్ పాస్ నిర్మాణం ఎత్తు తక్కువగా ఉందని, ఎత్తు పెంచాలన్నారు. ఈ రహదారి గుండా మధిర నుండి అంబారుపేట, నిధానపురం, మొలుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు కొనసాగుతుంటాయని తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం వరిగడ్డి లారీలు, సుబాబుల్ లారీలు, వరి కోత మిషన్లు, భారీ వాహనాలు రాకపోకలకు ఈ అండర్ పాస్ ఎత్తు సరిపోదని, ప్రజలు ఇబ్బందులు గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న అండర్ పాస్ ఎత్తు 12 నుంచి 115అడుగుల వరకే ఉంటుందని, దీనిని 18 నుంచి 20 అడుగులు ఎత్తు వరకు పెంచాలని రైతులు కోరుతున్నారు. ఎత్తు పెంచే వరకు అండర్ పాస్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, లేకుంటే పనులను అందుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిధానపురం గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను కొట్టిన ఘటనపై తహశీల్దార్ విచారణ



ప్రజాపక్షం/పెనుబల్లి: హాస్టల్ విద్యార్థులను హాస్టల్ వంట మనిషి దారుణంగా కొట్టిన విషయం తెలుసుకున్న పెనుబల్లి తహశీల్దార్ నారాయణ మూర్తి సోమవారం విచారణ చేపట్టారు. పెనుబల్లి మండలం విఎం బంజర్ ఎస్సి హాస్టల్ లో ఉంటున్న పిల్లలను అడుకుంటున్నారన్న నెపంతో వంట మనిషి రమేష్ గదిలోకి తీసుకెళ్లి దారుణంగా కొట్టాడని పిల్లలు తల్లిదండ్రులకు తెలిపారు. వారు వచ్చి అడగడంతో నిర్లక్ష్యంగా సమాదానం చెప్పడంతో తల్లి దండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ నారాయణ మూర్తి విచారించారు. హాస్టల్ కి వెళ్లి వార్డన్‌ను, కుక్ లను విచారించి వివరణ కోరారు. పిల్లలను కొట్టె అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. మరోసారి ఇలా జరిగితే పై అధికారులకు రిపోర్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల సహనంతో వ్యవహారించాలని సూచించారు. ఈ ఘటనపై విచారణ జరిపి వంట మనిషిపై చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ ని ఆదేశించారు. తహశీల్దార్ నారాయణ మూర్తికి వార్డెన్ వెంకటేశ్వరావు వివరణ ఇచ్చి మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

# సంక్షేమ పథకాలను అందించడంలో అధికారులే కీలకం

**-పొంతనలేని సమాధానాలతో సమీక్ష**
**-అసిస్టెంట్లు హాజరుపై ఆగ్రహం**
**-పూర్తిస్థాయి నివేదికలతో తనను కలవాలని ఆదేశం**



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో అధికారులే కీలకమని పినపాక ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యాప్తంగా ఉన్న 29 శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ముందుగా విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్‌ను మండలంలో 16805 కుటుంబాలు, 18 గ్రామ పంచాయితీలలో విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో ఎంత మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నాము అనే అంశాలను ప్రశ్నించగా, మొత్తం 22వేల కనెక్షన్లు ఉన్నాయని, 1000 కనెక్షన్లు వ్యవసాయం చేసే వారికి అందిస్తున్నామని, మండల పరిధిలో 3 సబ్ స్టేషన్లు ఉన్నాయని మండలంలోని కొంత మంది రైతులకు పూర్తి స్థాయిలో విద్యుత్ అందించేందుకు ముసలమడుగు పరిధిలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే సబ్ స్టేషన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ పాయం కలగజేసుకుంటూ తనకు కావలసిన సమాచారాన్ని మాత్రమే అందించాలని మండిపడ్డారు. మండలంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఉచిత విద్యుత్ ఎంత మందికి అందిస్తున్నామని అని అడగగా సుమారు 11వేల మంది అని అధికారి చెప్పారు. తప్పుడు సమాచారం అందించొద్దని ఎంఎల్‌ఎ పాయం ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలో మొత్తం 11204 మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఈ ఉచిత విద్యుత్ కొరకు ప్రభుత్వం పెట్టిన ఖర్చు 6 కోట్ల 78లక్షలని, మండలంలో 48 గ్రామాలలో ఎన్ని విద్యుత్ పోల్లు అవసరమో, శిధిలావస్థకు చేరిన పోల్లు వివరాలు అలాగే మండలంలో ఎన్ని కుటుంబాలకు విద్యుత్ అందించాలనే పూర్తి స్థాయి తనకు రాసి ఇవ్వాలని ఆయన ఏఈని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న మరో సంక్షుమ పథకం గ్యాస్ సబ్సిడీపై డిప్యూటీ తహసీల్దార్ సరైన సమాచారం అందించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో జములారెడ్డిని సమాచారం అందించాలని ఆదేశించిగా గ్యాస్ సబ్సిడీ పథకంలో మండల వ్యాప్తంగా 10300 కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని, ఇప్పటి వరకు 41వేల 698 గ్యాస్ బండలు అందించామని, కోటి 25లక్షల 49వేల రూపాయలు ఖర్చు చేశామని వివరించారు. అనంతరం ప్రభుత్వం అందించే మరో ప్రతిష్టాత్మక పథకం రైతు భరోసా రైతు రుణమాఫీ వివరాలను వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ ప్రశ్నించగా మండలంలో సమాచారం అందించారు. అదే విధంగా వరి పంట బోనస్‌పై వివరాలను అడగగా ఆ సమాచారం డివిల్ సప్లై అధికారుల వద్ద ఉంటుందని తెలిపారు. సివిల్ సప్లై అధికారులు సమావేశానికి రాలేదు. అలాగే మండలంలోని పశువులు చనిపోయిన కుటుంబాలకు ఎంత నష్టపరిహారం అందించారని అనే విషయాలను తెలియజేయాల్సిందిగా పశుసంవర్ధక శాఖ అధికారిని కోరగా ఇటీవల విధుల్లో చేరానని తన దగ్గర పూర్తి స్థాయి సమాచారం లేదని చెప్పడంతో ఎంఎల్‌ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా పలు శాఖల అధికారులు రాకుండా వారి అసిస్టెంట్లను సమావేశానికి పంపించడం, పలువురు వచ్చినా కూడా పొంత లేని విత సమాధానాలు చెప్పడంతో ఎంఎల్‌ఎ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అధికారులు ఈ విధంగా సమాచారం ఇవ్వడంపై మండిపడ్డారు. సీడీపీవో సమావేశానికి రాకుండా సూపర్వైజర్‌ను పంపించడంపై మండిపడ్డారు. అసిస్టెంట్లు తమ అధికారులను తీసుకొని తనను కలవాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు మండల వ్యాప్తంగా 529 మంజూరు కాగా సంబంధిత అధికారి తప్పు సమాధానం ఇవ్వడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన మంచి పనిని కూడా తక్కువ చేసి చూపడం సమంజసం కాదని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన 51 మంది ఇంత వరకు ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపడం లేదని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగా వారి చేత బలవంతంగా కాకుండా ఇష్టంతోనే ఒక లెటర్ రాతపూర్వకంగా రాయించుకొని అర్హులైన పేదలకు ఆ ఇల్లును కేటాయించాలని ఆదేశించారు. ఏ గ్రామంలో వెళ్లిన ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలు తమకు రాలేదని అనొద్దని, అలా ఎవరైనా ఉంటే పంచాయితీ కార్యదర్శులు బాధ్యత తీసుకొని వారి వివరాలు నమోదు చేసుకుని వారికి సంక్షేమ పథకాలు అందించే విధంగా చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని వెంటనే అమలు చేయాలి

ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని అడిషనల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఆధ్వర్యంలో మణుగూరు లోని పీకేఓసి2 లో ఫిట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యంతో జరిగిన స్ట్రక్చర్ సమావేశాలలో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్ట్రక్చర్ సమావేశాన్ని యూనియన్ బహిష్కరించిందని అన్నారు. సింగరేణి కార్మికులకు మెడికల్ బోర్డు విషయంలో గతంలో జరిగిన విధంగానే మెడికల్ బోర్డు నిర్వహించాలని, సంస్థ వాస్తవ లాభాలను ప్రకటించి, 35 శాతం వాటాను కార్మికులకు ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేసిందని అన్నారు. డిస్మిస్ అయిన కార్మికులకు మరొక అవకాశం కల్పించాలని కోరారు, అన్ని క్యాడర్ స్కీములను పరిష్కరించాలని, మారుపేరులతో ఉన్న ఉద్యోగుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. కొత్త ప్రాజెక్టులను ప్రైవేటు వారికి కట్ట పెట్టాలని ప్రభుత్వం, యాజమాన్యం ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులు మూతపడడం, నూతన ప్రాజెక్టులు రాకపోవడం వలన కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన మణుగూరు ఏరియాకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం స్పందించాలని లేనిచో కార్మికులను ఐక్యం చేసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి సింగరేణి కంపెనీని కాపాడుకుంటామని అన్నారు. అనంతరం ఓసి టు బేస్ వర్క్ షాప్ సందర్శించి అక్కడ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, తాగు నీరు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాం నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదేర్ల సురేందర్, బి సురేంద్రరావు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి.రవి, సాయి ప్రకాష్ చారి, రత్నం శివకుమార్, రాజందర్, నాగుల సతీష్, జానకి ప్రసాద్, కళ్యాణం రవి, గౌస్ పాషా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి



ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో వికలాంగులకు చేయూత పెన్షన్‌దారులకి ఇచ్చిన హామీని అమలు చేయని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని అన్నారు. సోమవారం వైరా తహశీల్దార్ కార్యాలయం వద్ద వికలాంగులు ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమంచి వెంకన్న మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీ చేయూత పెన్షన్‌దారులు రూ.2వేలు పెన్షన్ రూ.4వేలకు పెంచాలి. వికలాంగుల రూ.4వేలు పెన్షన్ రూ.6వేలకు పెంచాలి. నేటి వరకు కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాట నువ్వు నిలబెట్టుకోకుండా తప్పించుకోని తిరగడం సరైంది కాదని, అమలు చేయకపోతే వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల చేతుల్లో మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల సుజాత, అంజ.లి, ఆదినారాయణ, ఇండ్ల వెంకటి, నల్లగట్ల నాగేశ్వరరావు, కోట కోటేశ్వరరావు, మాగంగి బాబు, అయినాల కనకరత్నం, వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల సంఘాలు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. వైరా ఎమ్మార్వో శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

### యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు సాయిబాబా టెంపుల్ సమీపంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న తల్లాడ మండలం చిన్నారిగూడెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీనివాస్ అనే యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. కాలు తీవ్ర గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న వైరా సిఐ నునావత్ సాగర్ సంఘటనా స్థలం వద్దకు చేరుకొని ప్రమాదంలో గాయపడిన యువకుడిని 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

**- కల్లూరి, రావులపల్లి**
**- సిపిఐలో చేరిన 20 మంది యువకులు**







ప్రజాపక్షం/భద్రాచలం : యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పెద్ద ఎత్తున యువకులు సిపిఐలో చేరడం అభినందనీయమని సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్రసమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ అధ్యక్షతన సోమవారం స్థానిక కార్యాలయంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్ అధ్వర్యంలో 20 మంది యువకులు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో కల్లూరి, రావులపల్లి మాట్లాడుతూ దేశరాజకీయాల్లో యువత అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సిన తరుణం ఆసన్నమైందని, ప్రపంచ దేశాలు కూడా యువతను ప్రోత్సహిస్తూ రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ప్రపంచ దేశాలు సైతం కమ్యూనిస్టు పార్టీల పాలనను కోరుకుంటున్నాయని, దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టుల అవసరం ఉందని పలువురు మేధావులు, రాజకీయ నాయకులు ఇప్పటికే అంటున్నారని చెప్పారు. ఇలాంటి తరుణంలో పెద్ద ఎత్తున యువత పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. రాజకీయ విలువలు, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగాలని, కమ్యూనిస్టు పార్టీ యువత అంటే నలుగురికి ఆదర్శంగా నిలవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ముందుకుసాగాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రుద్రబోయి సూరిబాబు, చిట్టిబాబు, సాయిరాం, గోపి, నాగ శంకర్, సెల్వన్, రామశంకర్, వెంకటేశ్వర్లు, సాయి, వేణుక, సంతోష్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ నాయుడు, మీసాల భాస్కర్ రావు, కరెడ్ల సురేష్ నాయుడు, కొండబాబు, మహేష్, రామారావు, శోభన్ పాల్గొన్నారు.

## కాలేజీల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు

**- తక్షణమే ప్రభుత్వం ఫీజులను విడుదల చేయాలి**
**- విద్యార్థులతో కలిసి వామపక్ష విద్యార్థి సంఘాల నిరసన**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కాలేజీల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ప్రణయ్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు విజయ్ అన్నారు. సోమవారం సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో విద్యార్థి సంఘాల రౌండ్ టేబ్ల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ ప్రవేటు ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు చేపట్టిన బంద్‌ను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రావడానికి ముందు ఫీజులు విడుదలచేస్తామని ప్రకటించారని అన్నారు. కానీ అధికారం చేపట్టిన తర్వాత ఆ ఊసే ఎత్తక పోవడం అన్యాయమని, అదే కాకుండా ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కోసం కోర్టులను వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, యాజమాన్యాలు ఫీజులు జమ కాలేదని సర్టిఫికెట్లు నిలుపుదల చేస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. గత పదిహేను నెలలుగా విద్యార్థులు రోడ్లెక్కి నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని, తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా కాలేజీలయాజమాన్యాలు బంద్ చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవచూపాలని, తక్షణమే బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు షాహిద్, గుండాల సృజన్, వినయ్, సంజయ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మణుగూరు బొగ్గు గనులకు భవిష్యత్తు లేదన్నది అవాస్తవం



**-కార్మిక సమస్యలను పక్కదారి పట్టించేందుకే సింగరేణి చైర్మన్ బలరాం నాయక్ ప్రకటన**
**-మణుగూరుకు 40 సంవత్సరాల భవిష్యత్తు ఉన్నది**
**-ఐక్య ఉద్యమాల ద్వారా సింగరేణిని కాపాడుకుంటాం**
**-అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య**

ప్రజాపక్షం/మణుగూరు: ఆరేళ్లలో మణుగూరు బొగ్గు గనులకు భవిష్యత్తు లేదని దాదాపు 5,000 మంది కార్మికులు, అధికారులు, వారి కుటుంబాలు, కాలనీలు, వర్క్ షాపులు భవిష్యత్తులో ఉండవని సింగరేణి సి అండ్ ఎండి బలరాం నాయక్ ప్రకటన అవాస్తవమని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మణుగూరులో వివిధ గనులలో ఫిట్ మీటింగులు నిర్వహించామన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. యాజమాన్యం మొండివైఖరి నిరసనగా స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించామని అన్నారు. కార్మికుల సమస్యలను పక్కదారి పట్టించేందుకే చైర్మన్ అవాస్తవ ప్రకటన చేస్తున్నారని అన్నారు. సింగరేణికి ఇంకా వంద సంవత్సరాల భవిష్యత్తు ఉందన్నారు. మణుగూరు ఏరియాలో 1974 లోనే 100 సంవత్సరాల ప్రణాళికలతో బొగ్గు గనుల ప్రారంభించారని తెలిపారు. ఇంకా 50 సంవత్సరాలు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని అన్నారు. సింగరేణి కార్మికులు ప్రజలు ఎలాంటి అపోహలకు పోవద్దన్నారు. కార్మిక సంఘాల నాయకత్వంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించి సింగరేణి కాపాడుకుంటామన్నారు. మణుగూరు ఏరియాలో లాభాలు గడించే జి 7 గ్రేడ్ బొగ్గు ఉన్నదని అన్నారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి బొగ్గు గనుల విస్తరణకు కృషి చేయాలన్నారు. ఓబి ప్రైవేట్ కంపెనీల ద్వారా వెలికి తీయాలని, బొగ్గు సింగరేణి యాజమాన్యమే నిర్వహించాలని అన్నారు. లాభాలు ప్రకటించి వాస్తవ లాభాలు ప్రకటించి 35% కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 47 వేల కోట్ల సింగరేణి యాజమాన్యానికి చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎంవై రామ నర్సయ్య, ఎం ఈశ్వరరావు, ఆవుల నాగరాజు, ఏ సురేందర్, సరే రెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, జి వెంకటేశ్వర్లు, రాయల భిక్షం, ఎం కిషోర్ బాబు, లతో పాటు బ్రాంచ్ ఉపాధ్యక్షులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, కిషోర్, అడర్ల సురేందర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్స్‌ను వెంటనే పెంచాలని ధర్నా



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా పెన్షన్ ను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జీ తోళ్ల సురేష్ డిమాండ్ చేశారు. పింఛన్లు వెంటనే పెంచాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రం తహశీల్దార్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, వడ్లమూడి హనుమంతరావు, గుండె పొంగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల కుటుంబాలకు అండగా మంత్రి భరోసా



ప్రజాపక్షం/నేలకొండపల్లి : నిరుపేదల కుటుంబాలకు అండగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి భరోసా కల్పిస్తున్నారని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు సోమవారం పీఆర్ఎస్ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సహాయం ను అందించారు. మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదల సంక్షేమం కోసం మంత్రి శ్రీనివాసరెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొడాలి గోవిందరావు, పెంటమళ్ల పుల్లమ్మ, వెంకన్న, కొమ్మినేని శ్రీదేవి, వెంకటరెడ్డి, కొచ్చేర్ల శ్రీనివాసరావు, రాయపూడి నవీన్. కడియాల సరేష్ పాల్గొన్నారు.

## బెంచీలు, డిక్షనరీలను అందించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండలం గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ డిక్షనరీలు స్థానిక మాజీ ఉప సర్పంచ్ జూపల్లి ఉపేంద్రబాబు తమ తండ్రి జ్ఞాపకార్థంగా విద్యార్థులకు అందజేయగా వాటిని ఎమ్మెల్యే జారే స్వయంగా విద్యార్థుల చేతికి అందజేసి ఉపేంద్ర బాబు ని శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఏసిఎఫ్ ఆది అండ్ ఫ్రెండ్స్ చేయూత ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు కొత్త బెంచీలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యా శాక అధికారి కీసరి లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ పెయింటింగ్ కార్మికులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/దమ్మపేట: హౌస్ పెయింటింగ్ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఐ దమ్మపేట మండల కార్య దర్శి సుంకి పాక ధర్మ, మండల నాయకుడు బత్తుల సాయి, (ఏఐటియుసి) మండల కార్యదర్శి బెజవాడ రాము అన్నారు. సోమవారం దమ్మపేట మండలం అంబేద్కర్ హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం 3వ మండల మహాసభ దమ్మపేట లో సున్నం వినోద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ దమ్మపేట మండల వ్యాప్తంగా సుమారు 250 మందికి పైగా కార్మికులు హౌస్ పెయింటింగ్ వర్కర్స్ గా జీవనం సాగిస్తున్నారని, ఈ వృత్తి చేస్తున్న వారిలో అత్యధికంగా నిరుపేదలు ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలిచి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, పూర్తి సబ్సిడీతో బ్యాంకు లోన్లు ప్రభుత్వమే వారికి ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించి కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని, ప్రభుత్వం వారి కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం దమ్మపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంజ రాజు ఉపాధ్యక్షుడిగా కొలిక పోగు రత్నరాజు లను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నద్ది సత్యనారాయణ, కొలికపోగు భాస్కర్, భూక్య భాస్కర్, కోకిలంపాటి వెంకటేశ్వరరావు, సున్నం వినోద్, రాకేష్, శ్రీకాంత్, రాంబాబు, వీరస్వామి, కోటి రాజు. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం సిరిపురం(కెజి) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో షేక్ లతీఫ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిరిపురం కెజి గ్రామ కార్యదర్శి నాగశేషిరెడ్డి పాల్గొన్నారు. మాకు మా పాఠశాలకు వారి సహాయ సహకారాలు అందించినందుకు మా పాఠశాల ప్రధానోపధ్యాయురాలు, సావిత్రి ఉపాధ్యాయురాలు, ఇంద్రాణి తరపున విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగశేషిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, ఉపాధ్యాయులు, ఇంద్రాణి, అంగన్‌వాడీ టీచర్, జి.రాజేశ్వరి, మోరంపూడి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నైజాం నవాబును గద్దె దించిన చరిత్ర కమ్యూనిస్టులది



**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం దున్నేవాడికే భూమి కావాలని సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికి ఆదర్శమని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. రైతాంగ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అధ్యక్షతన శనివారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో దివంగత కొర్సా జోగయ్య, పెంటమ్మల స్థూపం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై జెండా ఆవిష్కరించి, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో జమ్ముల మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి ,బద్దం ఎల్లారెడ్డి, ముద్దమ యుద్ధం లాంటి ఎందరో మహనీయులు ఆనాటి నైజాంను గద్దె దించటానికి సాగించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణలో సామాన్య ప్రజలను సైతం సాయుదులుగా చేసి, బాంచన్ దొర నీ కాళ్ళు మొక్కుతా అన్న ప్రజల చేత, బందూకులు చేత పట్టించిందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య ,బందగి లాంటి సామాన్య ప్రజలను సైతం అసమాన్యులుగా మార్చి సాగించిన వీరోచిత పోరాటం ఎన్నటికీ మరువజాలదని, అట్టి పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, దండు ఆది నారాయణ, పూర్ణ చంద్ర రావు, సత్తుపల్లి మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, పట్టణ కార్యదర్శి నిమ్మటూరు రామకృష్ణ , పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్కే రంజాన్ బి, సిపిఐ మండల కమిటీ సభ్యులు కొర్సా వెంకటమ్మ , టౌన్ కమిటీ సభ్యులు ఎర్ర జల రాజశేఖర్, కోలేటి వెంకటేశ్వర్లు, మోహన్, మాధవి, చెరుకుపల్లి శాఖ కార్యదర్శి గడ్డం కృష్ణయ్య, తాటి రాజు, యువజన సమాఖ్య కన్వీనర్ ఎస్ కే హమీద్, లక్ష్మమ్మ , రమణ, రాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నతమైంది సాయుధ పోరాట చరిత్ర



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తూ ఎంతో మహోన్నతమైందని, దీని స్ఫూర్తితో దేశంలో అనేక ప్రజా, కార్మిక పోరాటాలు జరిగాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని మడుపల్లిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు ఊట్ల సాంబయ్య, యల్లమద్ది వెంకయ్య స్మారక స్థూపాల వద్ద జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ జమీందారీ, దోపిడి, అన్యాయాలపై పేద రైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటమని, ఇలాంటి మహోత్తర పోరాటాన్ని కేంద్రంలోని మోడీ సర్కార్ హైజాక్ చేసే ప్రయత్నాలు చేస్తుందని, ఈ పోరాటంలో బిజిపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ వంటి సంస్థల పాత్ర శూన్యమని అన్నారు. ప్రజా కార్మిక హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నేడు జరుగుతున్న పోరాటాలకు తెలంగాణ సాయుధ పోరాటం మార్గదర్శకమని, ఆనాటి సాయుధ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ భవిష్యత్ తరాలకు చైతన్యం కలిగించటం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల బాధ్యత అని అన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిపోయిన సాయుధ పోరాటాన్ని విలీన దినోత్సవంగా ఎందుకు జరపలేకపోకపోతున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు, పంగా శేషగిరిరావు, జల్లా బ్రహ్మం, తలారి రమేష్, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, నర్సింహారావు, ఊట్ల రామకృష్ణ, పున్నవెళ్లి అప్పారావు, యల్లమద్ది రాములు, కొండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల అండగా ఉంటామని హామీ ఇచ్చారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం కందుకూరు, భరణి పాడు గ్రామాలలో పంట పొలాలను ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును ఎమ్మెల్యే దంపతుల దృష్టికి తీసుకెళ్ళారు.వరుణ్ ఆగ్రో టెక్ కంపెనీకి చెందిన 2782 వరి విత్తనాలను కందుకూరు, భరణి పాడు గ్రామాలలోని రైతులం కొనుగోలు చేసి సుమారు 3,000 ఎకరాలలో సాగు చేశామని, 140 రోజులకు కాపుకు రావాల్సిన వరి, 70 రోజులకే ఈనటం మొదలయ్యిందని, ఈ విత్తనాలతో పూర్తిగా మోసపోయ్యామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం రైతులతో కలిసి కందుకూరు, భరణి పాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి వ్యవసాయ ఏడి,ఏఈ, తహశీల్దార్, మండల పరిషత్ అధికారుల నుండి పూర్తి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వైస్ చైర్మన్ వెంకటప్ప రెడ్డి, సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు, దొడ్డా శ్రీను, సుబ్బారెడ్డి, ఫైజుద్దీన్, వెంకటేశ్వర రెడ్డి, నాని, కందుకూరు, భరణి పాడు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# పాలనాధికారుల బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో దృఢ సంకల్పంతో ఎప్పటి నుంచో రైతుల వివాదాల్లో ఉన్న భూములను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం ధరణి పేరుతో తీసుకువచ్చిన భూ సమస్యల పరిష్కారం రైతులకు న్యాయం జరగటం లేదనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్రరెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రైతుల శాశ్వత భూ సమస్యల పరిష్కారం కోసం వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన రికార్డులను పరిశీలించిన అనంతరం రాష్ట్రంలో భూభారతి పేరుతో తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం అవుతున్నాయి. దానిలో భాగంగానే గత ప్రభుత్వం విఆర్వో వ్యవస్థను రద్దు చేయగా మళ్లీ భూభారతిలో సమస్యలు పరిష్కారం కావాలంటే వీఆర్వోలను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయంతో తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీలగాను మొత్తం 21 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో 16మందిని పాలనాధికారులుగా నియమించగా సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో 15మంది బాధ్యతలు స్వీకరించారు. పాలనాధికారులు నిర్వహించాల్సిన విధులు గ్రామస్థాయిలో పారదర్శకంగా రెవెన్యూ పహణీలు నమోదు, అన్ని రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ భూములు వక్ఫ్‌బోర్డు భూములు, దేవాదాయ శాఖ భూములు వంటి ఎలాంటి ప్రభుత్వ భూములు ఉన్న వాటిని భూ రికార్డుల్లో పొందపర్చటం, గత ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల కోసం కాల్వల్లో చెరువుల్లో కుంటల్లో నీటి వనరుల కింద భూ సంరక్షణ భూముల రికార్డులను అన్యాక్రాంతం కాకుండా భూ రికార్డు నమోదు చేయటం తదితతర వివరాలను పారదర్శకంగా పొందుపర్చాలని తహశీల్దార్ లూథర్ విల్సన్ పలు సూచనలు ఇచ్చారు.

# భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటమే సాయుధ పోరాటం



**ప్రజాపక్షం/బోనకల్:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు బుంగ తిరుపయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ముగింపు సభను ఈ నెల 16న బ్రాహ్మణపల్లి గ్రామంలో అమరవీరుల స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ ముగింపు సభకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ ముగింపు సభకు సిపిఐ శ్రేణులు, ఆయా శాఖ కార్యదర్శులు, బాధ్యులు పెద్ద ఎత్తున్న పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, బుంగ నరసింహ, బుంగ వెంకన్న, బుంగ గోపి, మందడపు మౌళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రిక్రూటర్ పోస్టులకు పిజి కళాశాల విద్యార్థుల ఎంపిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్రంలోని ఐటి హబ్‌లోని టెక్‌స్కై కంపెనీలో రిక్రూటర్ పోస్టులకు స్థానిక కాకతీయ యూనవర్సిటీ పిజి కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా।। చేకూరి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలకు తమ కళాశాలలో ఎంబిఏ, ఎంకాం, ఎంఏ ఇంగ్లీష్ చదువుకున్న విద్యార్థులు హాజరు కాగా సదరు పోస్టులకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో ఇంగ్లీష్ విభాగం నుంచి విద్యార్థిని వల్లూరి సారిక, ఎంకాం నుంచి పంబుల అమూల్య, ఏంబిఏ విభాగం నుంచి షేక్ రుక్సానా, బింగి సాయికిరణ్ లు ఉన్నట్లు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా।। చేకూరి రవికుమార్‌తో పాటు ఎంకాం, ఇంగ్లీష్ విభాగాధిపతులు డా।। టి. గోపి, జి. రమ, ప్లేస్‌మెంట్ అధికారిగా వ్యవహరించిన అధ్యాపకురాలు వనం లక్ష్మి హరిత పాల్గొని వారిని అభినందించారు. భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదిగి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని తోటి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తేవాలని సూచించారు. ఎంపికైన వారిని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని తూర్పులోకారం గ్రామ శివారులో సోమవారం పేకాటాడుతుండగా కల్లూరు ఎస్సై హరిత సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులో తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాలలో గంజాయి, పేకాట అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న సమాచారాన్ని అందించాలని అట్టి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు పోలీస్ స్టేషన్ తమ సెల్ నెంబర్‌కు సమాచారాన్ని అందించాలని కోరారు. ఎలాంటి వారినైనా ఎవరినైనా ఎలాంటి రికమండేషన్ అయినా సహించేది లేదని ఎవరిని వదిలేది లేదని ఎస్సై హెచ్చరించారు.

# ఖమ్మంరూరల్ రెవెన్యూ కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**



ఖమ్మంరూరల్ మండల రెవిన్యూ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, వీహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో వికాలాంగులతో కలిసి సోమవారం ముట్టడించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకం జనార్ధన్‌మాదిగ, చెరుకుపల్లి శ్రీనుమాదిగ, లక్ష్మయ్యమాదిగ, సురేష్‌మాదిగ, బొందయ్య మాదిగ, లింగమ్మమాదిగ, ముత్తమ్మమాదిగ, నర్సమ్మమాదిగ తదితరులు పాల్గొన్నారు.

# జిపిలను విధుల్లోకి చేర్చుకున్న తహశీల్దార్

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :**



రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జిపిఓ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జిపిఓలోగా నియమాక పత్రాలను అందుకున్నా సిబ్బంది సోమవారం తహశీల్దార్ మన్నె ఉషాశారదకు తమ జాయినీంగ్ రిపోర్టర్లును అందించారు. వారిని తహశీల్దార్ జిపివోలుగా విధుల్లో చేర్చుకున్నారు. మండల పరిధిలోని 16 క్లస్టర్లకు 14 క్లస్టర్ల జిపివోలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, జగదీష్, యుడిసి అక్బర్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ పంటల సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం

**-కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అంతర పంటల సాగుతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మూక మామిడి పంచాయితీ పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వెదురు సాగును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన రైతులు కనితి భద్రయ్య, కనితి రాధా, కనితి పొట్టమ్మల పొలాల్లో స్వయంగా వెదురు సాగును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ రైతులు కనితి భద్రయ్య, కనితి రాధా, కనితి పొట్టమ్మల పొలాల్లో స్వయంగా వెదురు మొక్కలు నాటి, గ్రామీణ వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. అనంతరం మొగరాల గొప్ప గ్రామంలో రైతు కీసర సుజాత వెదురు సాగును మొక్కను నాటి ప్రారంభించారు. అనంతరం కుంద్రు వెంకటమ్మ ఎకరం పొలంలో సాగు చేస్తున్న మునగ తోటను, గడ్డం వారి గుంపు గ్రామంలో రైతు కొమ్ము బుచ్చన్న సాగు చేస్తున్న రెండెకరాల మునగ సాగును పరిశీలించారు. ఈసందర్భంగా ప్రతి రైతు సంప్రదాయ పంటలతో పాటు కొత్త పంటలను ప్రయత్నించాలని, అంతర్ పంటల ద్వారా తక్కువ భూమిలోనూ అధిక ఆదాయం పొంద వచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటల్లో మునగ, బెండలను వేసుకుంటే అదనపు ఆదాయం వస్తుందన్నారు. వెదురు సాగులో పెసలు, బొబ్బర్లు, వినుములు, రాగి వంటి పంటలు వేసుకుంటే కుటుంబ ఆదాయం మరింతగా పెరుగుతుందని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ మూక మామిడి గ్రామ పంచాయితీ భవన నిర్మాణ పనులను పరిశీలించి, సంబంధిత అధికారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన్, తహసీల్దార్ గన్యా నాయక్, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏటీఎం వెంకయ్య, ఏపీవో హుస్సేన్, ఎల్‌డిఎం సమ్మక్క, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలను సందర్శించి కలెక్టర్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం లోని బంజర నెల్లిపాక ప్రాథమిక పాఠశాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈసందర్భంగా జిల్లాలోని విత్తనాల సేకరణ బరువు తదితర అంశాలలో మండలంలోని బంజర నెల్లిపాక ప్రాథమిక పాఠశాల మొదటి స్థానంలో నిలిచిందని వాటి విషయంలో విత్తనాల సేకరణ బరువు తదితర విషయాలని ప్రధానోపాధ్యాయురాలు విమలను, మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విమలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ మనిధర్, రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోటు రంగారావుకు అభినందన వెల్లువ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** హైదరాబాద్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిభ కనబర్చిన 25 మంది రైతులను ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం ఈ సంస్థ వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహిస్తూ వస్తుంది. ఈ క్రమంలో సోమవారం బేగంపేట హరిత హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి, తెలంగాణ, ఆంధ్రా, ఒడిషా, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాల్లో 350 ఎకరాలకు పైగా యూకలిప్టస్ సాగు చేస్తున్న భద్రాచలానికి చెందిన రైతులు తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర టిఎన్‌టియూసి ప్రధాన కార్యదర్శి పోటు రంగారావుని సంస్థల సలహాదారులు మాజీ సీబీఐ జేడీ లక్ష్మీ నారాయణ, సంగీత దర్శకులు ఆర్‌పి పట్నాయక్, టీడీపీ మాజీ ఎంఎల్‌సీ, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కిని నరసింహులు తదితరులు ఘనంగా సన్మానించారు. మంచి అభిరుచితో వ్యవసాయంలో అభివృద్ధిని సాధించి పలువురికి ఆదర్శంగా నిల్చిన పోటు రంగారావుకి ఈసందర్భంగా మిత్రులు, పుర ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు.

# ఘనంగా మోక్షగుండం జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సోమవారము సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా గల మోక్షగుండం విశ్వేశ్వరయ్య చౌక్ లో మన భారత దేశం గర్వించే సివిల్ ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతి 58 వ ఇంజనీర్స్ డే వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సంస్థ డైరెక్టర్ పిపి కే.వెంకటేశ్వర్లు వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంశ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మిపతి గౌడ్, గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.ర మణ మూర్తి, ప్రాతినిధ్యత సంఘం కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పి తాంబర రావు జిఎం పిపి కే. సాయి బాబు, జిఎంసేఫ్టీ సిహెచ్.శ్రీనివాస్, జిఎం హెచ్ఆర్‌డి టి.వెంకట రామి రెడ్డి, జిఎం సిఎం సిబి.శ్రీనివాస రావు, జిఎం పర్సనల్ వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం ఈఈ సెల్ ఏజీ మురళీధర రావు, సెక్రెటరీ సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఎస్.వెంకటా చారి, జిఎం ఈఎం ఎస్.వి.రామ మూర్తి, జిఎం ఆర్డిఎం.కనకయ్య, ఏజిఎం సివిల్ రామ కృష్ణ, డిజిఎం సివిల్ జి.సూర్యనారాయణ, వివిధ విభాగాల ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల పెన్షన్‌లు పెంచాలని ధర్నా



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా వితంతువులకు వికలాంగులకు ఒంటరి మహిళలకు పెన్షన్ పెంచుతానన్న హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చాపలమడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు వృద్ధులు వితంతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్లు పెంచాలని ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని, వికలాంగులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈకార్యక్రమంలో వికలాంగులు, టిడిపి మండల అధ్యక్షులు వారాది సత్యనారాయణ, బిజెపి నాయకులు శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవలు విస్తృతం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాలలో పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం షూ... సాక్కులను అందించారు. అమ్మగూడెం లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడపాల రామారావు, మాజీ సర్పంచ్ గండు సతీష్, ప్రధానోపాధ్యాయులు టి.వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. భైరవునిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మల్లెబోయిన పుష్ప,గొల్ల శ్రీనివాస్ రావు, ప్రధాన ఉపాధ్యాయులు జాన్సియా, ఉపాధ్యాయులు ఉసిరికాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి లో జరిగిన కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రస్టు ఆధ్వర్యంలో గత కొన్నేళ్లగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గం ను అన్ని రకాలు గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో మౌళిక సదుపాయాలు కల్పించటంతో పాటు, ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్వెన్నపూసల సీతారాములు, కొడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, ఆరెకట్ల గురవయ్య, నంబూరి రామారావు, మల్లెబోయిన శ్రీనివాస్ రావు, పొలంపల్లి పిచ్చయ్య, బొందయ్య, మామిడి వెంకన్న, మరికంటి రమేష్,బచ్చలకూరి నాగరాజు, గండు సైదులు,జెర్రిపోతుల సత్యనారాయణ, మైశా శంకర్, కడారు వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, వాకా శ్రీనాథ్, వేగినాటి లక్ష్మినర్సయ్య, ఏడుకొండలు, మోర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పెంపుకై తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలో చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ముట్టడి మండల నాయకులు దెబ్బెందుల సాయికుమార్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు చెంగల గురునాథం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వృద్ధులకు వితంతువులకు చేయూత పెన్షన్ దారులకు 2000 నుండి 4000, వికలాంగులకు 4000 నుండి 6000లకు పెన్షన్‌లు పెంచుతామని మోసం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసుకుని సుమారుగా 22 నెలలు కావస్తున్న ఇప్పటి వరకు పెన్షన్ పెంచకపోవడం సిగ్గు చేటు అన్నారు. పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సుమారుగా 2 నెలల నుండి రాష్ట్రంలో పెన్షన్‌లపై పెద్ద యుద్ధం జరుగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఇప్పటికైనా పెన్షన్లు పెంచకపోతే వెంటనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో విహెచ్‌పిఎస్ నాయకులు బిక్షం, బాలు, గార్లపాటి కృష్ణ, చేయూత పెన్షన్ దారులు సృజన్, వెంకట్, వికాస్, బద్రి, శివకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మార్కెట్‌పై ముందుకెళావెల్దాం

**- మంత్రి పొంగులేటి క్యాంప్‌కార్యాలయ ఇంఛార్జ్ దయాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లి మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, అన్ని శాఖల అధికారులు, పాలకవర్గంతో చైర్మన్ బైరు హరినాథ్‌బాబు అధ్యక్షతన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ నడవడంలో కావాల్సిన సలహాలు, సూచనలు వారిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై చాంబర్ ఆఫ్‌కామర్స్ తరుపు నుంచి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు మాట్లాడారు...బ్యాంక్, రహదారులు, కొనుగోలు సరుకు ఉంచేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు, వ్యాపారుల కోసం షాప్‌లతో పాటు మార్కెట్‌కు అవసరమైన అన్ని సౌలతులను కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈక్రమంలో చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణ ఆదిలోనే హంసపాదులా? వ్యాఖ్యలు చేశారు.వ్యాపారులు ఇంతదూరం రాలేరని, ఖమ్మం మార్కెట్ తమకు చాలనేలా విముఖతను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ...మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో అన్ని సౌలభ్యాలను కల్పిస్తామని, ట్రాన్స్‌పోర్టింగ్, స్టాక్‌ను ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కెట్ విస్తరణకు మంత్రి పొంగులేటి తరుపున సహాయసహకారాలను అందుతాయన్నారు.కావున రైతుల సౌకర్యార్థం మార్కెట్ నడవడంలో వ్యాపారులు ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, డైరెక్టర్లు తేజావత్ పంతులే నాయక్, వంగూరి రవి, సతీష్, చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షకార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి మండల నూతన మెకానిక్‌ల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల ఎలక్ట్రీషన్లు, మోటార్ మెకానిక్‌ల నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. సింగరేణి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ప్రైవేట్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ నూతన మండల కమిటీని అధ్యక్షులుగా భోగిళ్ళ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజావలి, కార్యదర్శిగా కేతమల్ల శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శిగా కుమ్మరి నవ కిషోర్, కోశాధికారిగా వేములపల్లి కృష్ణ ప్రసాద్, ప్రచార కార్యదర్శులుగా కే పృథ్వీరాజ్, షేక్ మజీద్ పాషా, యాకూబ్ పాషా, సలహాదారులుగా బొందల వెంకటేశ్వర్లు, భూక్య హుస్సేన్, పిట్టల నాగరాజు, ఎస్‌కే మీరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రీషన్లు, మోటార్ సైకిల్ మెకానికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకై తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండలానికి చెందిన ఎలక్ట్రీషియన్లు, మోటార్ సైకిల్ మెకానికులు, పాల్గొన్నారు.

# అంబేద్కరిజం, కమ్యూనిజం ఒక్కటే..



- దళితుల హక్కులకై పోరాడింది భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే
- కులాల ఉచ్చులో పడొద్దు - హక్కులకై పోరాడాలి
- అంబేద్కర్ కొందరి వాడు కాదు అందరివాడు
- అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** చదువు, చదివించు, సమీకరించు, పోరాడు అనేది అంబేద్కర్ సిద్ధాంతమని, అంబేద్కర్ రచనలు, కమ్యూనిస్టు సిద్ధాంతం ఒక్కటేనని, దళితుల హక్కుల కోసం మొదటి నుండి పోరాడింది, పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీయే అని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధి సీతారామపట్నంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా,టిపిసిసి సభ్యులు నాగసీతారాములతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దేశంలో కులాలు ఉన్నాయని అన్నారు. గతంలో ఓ వర్గం బలంగా ఉండటంతో ప్రజలను కులాలుగా విభజించారని, వారి అభివృద్ధిని తుంగలో తొక్కారని ఆరోపించారు. భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని అప్పటి నుండి ప్రజల హక్కుల కోసం, వాటిని సాధించటానికి పోరాడింది, పోరాడుతున్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. ప్రపంచ మేధావి అంబేద్కర్ అని ఆయన విగ్రహాలు ఓ చదువుకు, ఓ సమీకరణకు, ఓ పోరాటానికి స్ఫూర్తినిస్తాయన్నారు. అంబేద్కర్ కొందరి వాడు



కాదని అందరివాడన్నారు. అనంతరం నిర్వాహకులు ఎంఎల్‌ఏను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, టిజెఎస్ జిల్లా అధ్యక్షులు దేవదానం, దొప్పలపూడి సురేష్‌బాబు, శనగ వెంకటేశ్వరరావు, నాయకులు కాల్వ భాస్కర్, ప్రకాష్, నల్లమల్ల సత్యం, బిల్లా సృజిత్, దైదా, దుర్గా ప్రసాద్, ధర్మరాజు, కాల్వ రామారావు, గుండూరి శ్రీను, పండగ వెంకటేశ్వర్లు, నారాయణ, దాసరి రమేష్, తీట్ల వెంకటేశ్వర్లు,అశోక్, రాజు, కళ్యాణ్, చాణక్య, గౌతం, బిల్లా సృజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాలకులు అన్నదాతలకు శాపంగా మారారని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఆరోపించారు. ఎస్‌కేఎం పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ముత్యాలవిశ్వనాథం, న్యూడెమోక్రసీ నాయకులు, ఇల్లెందు మాజీ ఎంఎల్‌ఏల్ గుమ్మడి నర్సయ్య, తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ మాట్లాడారు. వ్యవసాయ సీజనల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవసరానికి సరపడా యూరియాను అందించడంలో విఫలమయ్యారని, రైతులు విక్రయకేంద్రాల వద్ద పడిగాపులుగాయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సీజన్ లో 90 లక్షల టన్నుల యూరియా దిగుమతులు కావాల్సి ఉన్నప్పటకీ కేవలం 37 లక్షల టన్నులను మాత్రమే ఉంచారన్నారు. కేంద్ర పాలకులు కార్పోరేట్ కంపెనీలతో మిలాఖాత్ అయ్యి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. రైతుల పంటల అవసరాలకు సరిపడా ఎరువులు సరఫరా చేయా




లని, పత్తి దిగుమతిపై ఉన్న 11 శాతం సుంకం ఎత్తివేతను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ప్రజాక్షేత్రంలో ముందుకు సాగలేవని గుర్తు చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున రైతులను ఏకం చేసీ ఉధ్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిని వినతి పత్రాన్ని కలెక్టరేట్ పరిపాలనాధికారికి అందజేశారు. ఆఈ కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచంద్రరావు, సలిగంటి శ్రీనివాస్, సాగర్, బానోత్ ఊక్లా, అమర్లపూడి రాము, తాళ్లూరి పాపారావు, కొమారి హన్మంతరావు, సపావత్ రవి, బానోత్ ధర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

-టిజెఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన
-మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్న ఐజెయు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టులపై అక్రమ కేసుల నమోదును నిరసిస్తూ ఖమ్మంలో జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సోమవారం ఖమ్మం జెడ్పి కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన జర్నలిస్టులు అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టి న్యూస్ జిల్లా ప్రతినిధి వెన్నబోయిన సాంబశివరావు తో పాటు వీడియో జర్నలిస్టు నాగరాజుపై కొణిజర్ల పోలీసులు అక్రమ కేసులు బనాయించిన విషయం విధితమే. దీనిని నిరసిస్తూ జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా టియుడబ్ల్యూ జె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగాన్ని అవమానపరిచేలా ఉన్నాయన్నారు. జర్నలిస్టులపై దేశ ద్రోహం లాంటి సెక్షన్లను ప్రయోగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తప్పుడు కేసుల ద్వారా మీడియా స్వేచ్ఛను హరించాలని చూస్తే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని ఆయన తెలిపారు. యూరియా కొరత ఉన్న విషయం దేశంలోనే అందరికి తెలిసిన విషయమని దానిపై వార్తలు సేకరించడం ద్వారా ప్రభుత్వాలకు వచ్చిన నష్టమేమిటని రాంనారాయణ ప్రశ్నించారు. టిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగానే కేసులు నమోదు చేశారన్నారు. జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించడం



సరైన చర్య కాదని ఇప్పటికైనా అధికారులు పునః పరిశీలన చేయాలని ఆయన కోరారు. కేసులు ఉపసంహరించు కోకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు, ఐజెయు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భూపాల్, మహేందర్, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా కోశాధికారి శివానంద, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, మీడియా ప్రతినిధులు శ్రీధర్, నారాయణ, సత్యనారాయణ, వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు అప్పారావు, సంపత్, సుధాకర్, టిజెఎఫ్ నాయకులు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్య, ప్రశాంత రెడ్డి, శెట్టి రజనీకాంత్, అడపాల నాగేందర్, హరీష్, వెంకటరమణ, రమేష్ బాబు, రాంబాబు, ఉదయ్, చక్రవర్తి, కోటేశ్వరరావు, జగదీష్, విజేత, నరేందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# పోడు పట్టా పంటలకు భరోసా ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/కొణిజర్లః** పోడు భూమి సాగు చేసుకొని పండిస్తున్న పోడు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని కొణిజర్ల మండలం రామనరసయ్య నగర్ పోడు రైతులు సోమవారం నాడు కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారి వినతిపత్రం అందజేశారు. అటవీ హక్కుల చట్టం ద్వారా ప్రభుత్వం నుండి పోడు పట్టాలు పొంది పంటలు పండించుకుంటున్న వారందరికి ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాశం అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాజీ సర్పంచ్ కంపసాటి వెంకన్నలు ప్రభుత్వాన్ని కోరారు. వీరితో పాటు సాగు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన సదుపాయలు కల్పించడం అభినందనీయం



**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థులకు ఐటిసి పిఎస్‌పిడి మెరుగై సదుపాయాలు కల్పించడం అభినందనీయమని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. ఐటిసి సంస్థ సహకారంతో స్థానిక డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన వారు మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు పేపర్ బోర్డు సంస్థ సదుపాయాలు కల్పించడం గర్వంగా ఉందని, విద్యార్థినీ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ చదువులను నిర్లక్ష్యం చేకుండా మంచిగా చదవాలని, చదువుకుంటే జీవితాల్లో ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఐటిడిఏ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ఐటిసి పిఎస్‌పిడి హెచ్‌ఆర్ పి శ్యాం కిరణ్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి పిఎస్‌పిడి కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, చెంగళ రావు, దుర్గాప్రసాద్, కామేశ్వరరావు, బాలయోగి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని అర్హులైన ప్రతీ గిరిజనులకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తామని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన గిరిజనుల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం చాలా మంది అర్జీలు సమర్పిస్తున్నారని, కానీ కేవలం స్వయం ఉపాధిపథకాల కోసం మాత్రమే సమర్పించాలన్నారు. పెట్టుకున్న దరఖాస్తుల ప్రకారం అర్హులైన వారిని గుర్తించి సరైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

# మండలాల వారీగా ప్రజావాణి : సబ్ కలెక్టర్

**- పలు మండలాల్లో దరఖాస్తులు స్వీకరణ**




**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని మండలాల వారీగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట అన్నారు. ఇందులో భాగంగా భద్రాచలం 01, దుమ్ముగూడెం05, చర్ల07, బూర్గంపాడు08, అశ్వాపురం07, మణుగూరు51, పినపాక06, కరకగూడెం03 దరఖాస్తులను సంబంధిత తహశిల్దార్లు స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు అందించాలన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/ఏన్కూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పథకంలో భాగంగా వితంతువులు, వికలాంగులు,వృద్ధులకు పెన్షన్లు పెంచి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి 22 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదని ప్రభుత్వ పనితీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంగళ నరేష్ ఆధ్వర్యంలో విహెచ్పిఎస్ నాయకులతో కలిసి సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండూరి రాజేష్ మాదిగ,మండల అధ్యక్షుడు దామెర్ల వీరయ్య, బోయ సుదర్శనం భాగం రవి, పిల్లల మరి నాగరాజు మోదుగు నాగరాజు,సురేందర్, కుపయ్య, కృష్ణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.